24 గంటల్లో 656 కరోనా కేసులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 24: దేశంలో తాజాగా 656 కరోనా కేసులు నమోదయ్యాయని కేంద్రం ఆదివారం వెల్లడించింది. కరోనా కారణంగా కేరళలో ఒకరు చనిపోయారని తెలిపింది. దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 3,742కు చేరింది. అయితే తాజాగా కేసులు పెరగడంపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. కాకపోతే అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరిస్తే బాగుంటుందని సూచించింది.

భయం అక్కర్లేదు: కేంద్రమంత్రి

కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్ స్పందించారు. పౌరులతో పాటు పర్యాటక రంగం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గతంలో కొవిడ్‌ను మనం సమర్థవంతంగా ఎదుర్కొన్నామని పేర్కొన్నారు. గోవాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు స్పందించారు.

ద్రోహినో..దేశభక్తుడినో ప్రజలే చెప్తారు

పార్లమెంట్‌లో అలజడిపై స్పందించిన మైసూర్ ఎంపీ

బెంగళూరు: పార్లమెంట్‌లో ఇటీవల అలజడికి సృష్టించిన ఇద్దరు వ్యక్తులకు విజిటర్ పాసులు ఇచ్చిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా తొలిసారి ఆ విషయమై స్పందించారు. ఓ సంఘం ప్రచురించిన ఓ పోస్టర్‌లో తాను చేతిలో బాంబుతో ఉన్నట్టు చూపిస్తూ దేశ ద్రోహి అని రాయడంపై ఆయన స్పందించారు. 'నా గురించి ప్రజలకు తెలుసు. 2024 లోక్ సభ ఎన్నికల్లో వారే తీర్పు చెబుతారు. చాముండేశ్వరి మాత, కావేరీ మాత, 20 ఏళ్ల నుంచి నా వ్యాసాలను చదువుతున్న వారు, 20 ఏళ్ల నుంచి నా కృషిని చూస్తున్న మైసూరు, కొడగు ప్రజలు నేను దేశ ద్రోహినా? దేశ ప్రేమికుడినా? అనే విషయంపై తీర్పు చెబుతారు. 2024లో లోక్‌సభ ఎన్నికల్లో వారు తీర్పు చెబుతారు.నేను దేశ ద్రోహినా? దేశ భక్తుడినా? అనే విషయంపై తీర్పు చెప్పవలసినది వారే'' అని ప్రతాప్ సింహా అన్నారు.

దేశవ్యాప్తంగా 15 కిసాన్ పంచాయత్‌లు

బెంగళూరు, డిసెంబర్ 24: వచ్చే ఏడాది ఫిబ్రవరి 26న నిర్వహించతలపెట్టిన 'ఢిల్లీ చలో' సన్నాహాల్లో భాగంగా వచ్చే నెలన్నర వ్యవధిలో దేశవ్యాప్తంగా మరో 15 కిసాన్ మహా పంచాయత్‌లు నిర్వహిస్తామని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) ఆదివారం వెల్లడించింది. ఇప్పటికే గత 15 రోజుల్లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆరు మహాపంచాయత్‌లు జరిపామని రైతు సంఘాల నేతలు పేర్కొన్నారు. ఎంఎస్పీకి చట్టబద్ధత, రైతు రుణాల మాఫీ తదితర ఏడు ప్రధాన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఎస్కేఎం చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చింది.

2019 ప్రశ్నాపత్రాన్నే తిరిగి ఇచ్చారు!

ఫెలోషిప్ పరీక్షపై అభ్యంతరాలు

ముంబై, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నిర్వహించిన బార్టి, సారథి, మహాజ్యోతి ఫెలోషిప్ పరీక్షపై అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 2019 పరీక్షలో ఇచ్చిన ప్రశ్నపత్రాన్ని యథాతథంగా 2023 పరీక్షలో ఇచ్చారని చెప్పారు. పాత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేసిన విద్యార్థులు అధిక మార్కులు సాధించే అవకాశం ఉందన్నారు. ఈ ప్రశ్నపత్రాలు చిరిగిన కవరులో వచ్చాయని ఆరోపిస్తున్నారు. పేపర్ లీక్ అయ్యిందని, విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

పొత్తిళ్లలో దాచుకొని.. ప్రమాదం నుంచి కాపాడుకొని..

రైలు పోతున్నప్పుడు..

రైలు వెళ్లిపోయాక..

పట్టాల పక్కన నక్కి పిల్లలను రక్షించుకొన్న తల్లి

బార్హ్(బీహార్), డిసెంబర్ 24: తల్లి ప్రేమకు సాటి లేదంటారు. అలాంటి తల్లి ప్రేమను చాటిచెప్పే ఘటన ఒకటి శనివారం బీహార్‌లోని బార్హ్ రైల్వే స్టేషన్‌లో జరిగింది. ఏదైనా ప్రమాదం ఎదురైతే, కోడి తన పిల్లలను కడుపులో దాచుకొని ఎలా కాపాడుకుంటుందో.. ఆ తల్లి కూడా తన ప్రాణాలను లెక్క చేయకుండా తన ఇద్దరు పిల్లలను ఒడిలో దాచుకొని పెద్ద రైలు ప్రమాదం నుంచి బయటపడ్డారు. శనివారం బార్హ్ స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. ఆగి ఉన్న ఢిల్లీ వెళ్లే రైలు ఎక్కేందుకు భారీ సంఖ్యలో ప్రయాణికులు గుమిగూడి ఉన్న క్రమంలో ఓ మహిళ తన పిల్లలతో కలిసి రైలు ఎక్కేందుకు ప్రయత్నించారు. అయితే తోపులాటలో ప్లాట్‌ఫామ్‌కు, రైలుకు మధ్య ఉండే ఖాళీ స్థలంలో తన ఇద్దరు పిల్లలతో సహా ఆమె పడిపోయారు. దీన్ని ఎవరూ గమనించలేదు. తర్వాత వెంటనే రైలు బయలుదేరింది. అయితే తన తన పిల్లలను రక్షించుకోవడానికి ఆ తల్లి మనసు తపించింది. వెంటనే తన శరీరంతో పిల్లలను చుట్టేసుకొని కదలకుండా అలాగే వంగి పడుకుంది. అంగుళాల గ్యాప్‌లో వారి పక్కనుంచి రైలు వెళ్లింది. అదృష్టవశాత్తూ వారికి ఏమీ కాలేదు. రైలు వెళ్లిన తర్వాత స్థానికులు మహిళను, పిల్లలను పైకి చేర్చి తగిన సపర్యలు చేశారు. తర్వాత చికిత్స నిమిత్తం స్థానిక దవాఖానకు తరలించారు.

పట్టాల మీద నుంచి లేచి..

చిన్నారిని పైకెత్తి..

నిరసన కుస్తీ.. కదిలిన కుర్చీ

- డబ్ల్యూఎఫ్ఐ నూతన కార్యవర్గంపై సస్పెన్షన్
- విమర్శల నేపథ్యంలో క్రీడా శాఖ నిర్ణయం
- నిబంధనలు ఉల్లంఘించలేదన్న కొత్త అధ్యక్షుడు
- పోరాటం కొనసాగిస్తామన్న రెజ్లర్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 24: రెజ్లింగ్ వివాదంలో కీలక మలుపు చోటు చేసుకొన్నది. గత కొంత కాలంగా వార్తల్లో నానుతున్న ఈ అంశంలో కేంద్ర క్రీడా శాఖ అనూహ్య నిర్ణయం తీసుకుంది. మూడు రోజుల క్రితం కొత్తగా ఎన్నికైన డబ్ల్యూఎఫ్ఐ కార్యవర్గాన్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. క్రీడా శాఖ విధివిధానాలను అమలు చేయలేదనే కారణంతో తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని వెల్లడించింది. సంజయ్ సింగ్ డబ్ల్యూఎఫ్ఐ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం అండర్-15, అండర్-20 జాతీయ పోటీలను ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రెజ్లర్లు పోటీలకు సిద్ధమయ్యేందుకు సమయం ఇవ్వకుండా ప్రకటన వెలువరించిన కారణంగా కొత్త కార్యవర్గంపై వేటు వేసినట్లు క్రీడా శాఖ వెల్లడించింది. రెజ్లింగ్ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు తాత్కాలిక కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా భారత ఒలింపిక్ సంఘాన్ని క్రీడా మంత్రిత్వ శాఖ కోరింది.

రెజ్లర్ల హర్షం

ఇది రెజ్లర్ల పోరాటానికి దక్కిన విజయమని పలువురు అభివర్ణించారు. నిర్ణయం తీసుకునేందుకు ఆలస్యమైనా.. రెజ్లర్లకు న్యాయం జరుగుతుందనే ఆశ కలిగింది అని ప్రముఖ రెజ్లర్ గీతా ఫొగట్ పేర్కొనగా.. ఈ పని ముందే చేసి ఉండాల్సింది అని స్టార్ బాక్సర్ విజేందర్ సింగ్ అభిప్రాయపడ్డాడు.

పద్మశ్రీ తిరిగి తీసుకోను: బజరంగ్

డబ్ల్యూఎఫ్ఐలో సమూల ప్రక్షాళన జరగాలని స్టార్ రెజ్లర్ బజరంగ్ పునియా పేర్కొన్నాడు. పద్మశ్రీ అవార్డును తిరిగి తీసుకోనని.. న్యాయం దొరికేంత వరకూ పోరాడుతూనే ఉంటానని పేర్కొన్నాడు.

రెజ్లింగ్‌కు దూరంగా ఉంటా: బ్రిజ్‌భూషణ్

ఇక పై రెజ్లింగ్ వ్యవహారాల్లో తలదూర్చనని.. క్రీడా రాజకీయాల నుంచి రిటైర్మెంట్ తీసుకుంటున్నట్లు బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ వెల్లడించాడు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గమే అన్నీ చూసుకుంటుందని అన్నాడు.

సస్పెన్షన్ ఎత్తివేయమని కోరుతాం...

సస్పెన్షన్ ఎత్తివేయమని కేంద్రాన్ని కోరుతామని డబ్ల్యూఎఫ్ఐ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సంజయ్ సింగ్ చెప్పారు. తాము నిబంధనలను అతిక్రమించ లేదని వివరిస్తామని, సమస్య పరిష్కారం కాకుంటే న్యాయపరంగా ముందుకు పోయే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. ఇప్పటివరకు తాము తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన ఆధారాలను కూడా క్రీడా శాఖ మంత్రికి సమర్పిస్తామని చెప్పారు.

అభిమానులతో సంజయ్ సింగ్(ఫైల్)

బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్

రెజ్లర్ల పోరాటం సాగిందిలా...

డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ మహిళా రెజ్లర్లతో తప్పుగా ప్రవర్తిస్తున్నాడనే కారణంతో స్టార్ రెజ్లర్లు ఈ ఏడాది జనవరి 18న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. వారి నిరసనలతో దిగొచ్చిన క్రీడా శాఖ ఫిబ్రవరి నెలలో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. అయితే ఆధారాలున్నా బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయలేదని కుస్తీ యోధులు ఏప్రిల్‌లో సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో కేసు నమోదైంది. మేరీకోమ్ కమిటీ ఇచ్చిన నివేదికపై అసంతృప్తి వ్యక్తం చేసిన రెజ్లర్లు మే నెలలో మరోసారి ఆందోళన బాట పట్టారు. కొత్త పార్లమెంట్ ప్రారంభోత్సవం సందర్భంగా ర్యాలీ చేసిన రెజ్లర్లను పోలీసులు ఈడ్చి పారేయడం విమర్శలకు తావిచ్చింది. ప్రభుత్వం వ్యవహరించిన తీరుతో అసంతృప్తిగా ఉన్న రెజ్లర్లు తమ పతకాలను యమునా నదిలో కలపాలని నిర్ణయించుకున్నారు. అయితే రైతు సంఘాల నేతల జోక్యం ఆ నిర్ణయాన్ని విరమించుకొన్నారు. జూలైలో డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల షెడ్యూల్ వచ్చినా వరుసగా వాయిదా పడుతూ వచ్చింది. డిసెంబర్ 21న ఎట్టకేలకు డబ్ల్యూఎఫ్ఐకి ఎన్నికలు జరిగాయి.

రెజ్లింగ్ వివాదం.. బీజేపీకి ప్రతికూలం!

ఎన్నికల్లో ప్రభావం చూపాచ్చని పార్టీలో భయం

న్యూఢిల్లీ, డిసెంబర్ 24: డబ్ల్యూఎఫ్ఐ వివాదాన్ని విపక్షాలు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా ప్రయోగిస్తాయని అధికార బీజేపీ భావిస్తున్నది. అందుకే నష్ట నివారణలో భాగంగానే ప్రభుత్వం సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నట్టు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా రెజ్లర్ సాక్షి మాలిక్ రెజ్లింగ్‌కు గుడ్‌బై చెప్పడం, మరో రెజ్లర్ బజరంగ్ పునియా తన పద్మశ్రీని వెనక్కి ఇచ్చేస్తున్నట్టు ప్రకటించడం సంచలనం సృష్టించింది. దేశానికి పతకాలు తెచ్చిన వారికి మోదీ ప్రభుత్వం ఇచ్చే మర్యాద ఇదేనా అన్న చర్చలు ఆ పార్టీని ఇబ్బందుల్లోకి నెడుతున్నది. క్రీడా, రాజకీయ రంగాల్లో ఈ అంశం ప్రతికూల ప్రభావం చూపనుంది. దీని వలన అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీలో భారత్ ప్రతిష్ఠ మసకబారుతుందని భావిస్తున్నారు.

మహిళ, జాట్ ఓటర్లపై ప్రభావం

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల అంశాన్ని 2024 ఎన్నికల్లో కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు కనుక ప్రచారం చేస్తే అది మహిళా, జాట్ ఓటర్లపై ప్రభావం పడి బీజేపీని గట్టి దెబ్బే తీస్తుందని ఆ పార్టీ రాజకీయ వ్యూహకర్తలు హెచ్చరించారు. ఈ క్రమంలోనే బ్రిజ్ భూషణ్‌ను బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఢిల్లీ పిలిచి చర్చలు జరిపారు. చర్చల అనంతరం ఇక నుంచి రెజ్లింగ్ వ్యవహారాల నుంచి తాను రిటైర్‌మెంట్ తీసుకుంటున్నట్టు శనివారం బ్రిజ్ భూషణ్ ప్రకటించారు. నష్ట నివారణ చర్యల్లో భాగంగానే బీజేపీ ఆయనతో ఈ ప్రకటన చేయించినట్టు సమాచారం.

మోదీని ఓడించాలంటే నితీశే బెస్ట్!

ఆయనే సరైన నేతన్న జేడీయూ ఎంపీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో), హైదరాబాద్ (నమస్తే తెలంగాణ) : ఇండియా కూటమిలో లుకలుకలు బయటపడుతున్నాయి. ప్రధాని పదవికి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేరును టీఎంసీ అధినేత్రి మమత ప్రతిపాదించగా, ఇప్పుడు దానికి కౌంటర్‌గా ప్రధాని మోదీని ఓడించాలంటే నితీశ్ కుమార్‌లాంటి మచ్చ లేని నాయకుడు కావాలని నలంద జేడీయూ ఎంపీ కౌశలేంద్ర చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీశాయి. ఇండియా కూటమిలోని ప్రతిపక్ష పార్టీలను ఏకం చేయడానికి కృషి చేసింది నితీశ్ అని కౌశలేంద్ర నొక్కి చెప్పారు. కూటమిలో నితీశ్‌కుమార్‌కు ముఖ్యమైన బాధ్యతలు అప్పగించపోవడం వల్లనే కూటమిలో మనస్పర్ధలు వస్తున్నాయన్నారు. మమత ప్రతిపాదన అంతిమం కాదని, ప్రధాని పదవికి మల్లికార్జున ఖర్గే పేరును మమతా బెనర్జీ ప్రతిపాదించడం వెనుక, ఆయన సీనియర్ నాయకుడన్న మర్యాద మాత్రమే ఉందని ఆయన అన్నారు.

ఉత్తరాది వారిని అవమానించడమే

దయానిధి వ్యాఖ్యలపై భగ్గుమన్న పార్టీలు

పాట్నా: డీఎంకే ఎంపీ దయానిధి మారన్ అనుచిత వ్యాఖ్యల వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ కావడంతో ఆదివారం సోషల్ మీడియా వేదికగా డీఎంకే, ఇతర పార్టీల మధ్య మాటల యుద్ధానికి తెరలేచింది. మారన్ వ్యాఖ్యలను బీహార్ ఉపముఖ్యమంత్రి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఇది బీహార్, యూపీ ప్రజలను అవమానించడమేనని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న వారిని గౌరవించాలన్న కనీస మర్యాదను ఆయన మరిచారన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి షెహ్‌జాద్ పూనావాల మాట్లాడుతూ డీఎంకే ఎంపీ వ్యాఖ్యలపై ఇండియా కూటమిలోని పార్టీలు ఎందుకు నోరెత్తడం లేదని ప్రశ్నించారు. తమ మాతృ భాష తమిళం, ఇంగ్లీష్ చదవడం వల్ల వ్యక్తులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారనన దానికి గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ లాంటి వారే ఉదాహరణ అని ఈ ఏడాది మార్చిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎంపీ మారన్ వ్యాఖ్యానించారు. అదే హిందీ మాత్రమే తెలిసినవారు టాయిలెట్ క్లీనర్లు, నిర్మాణ రంగ కార్మికులు నిలిచిపోతారని, దానికి యూపీ, బీహార్ నుంచి తమిళనాడు లాంటి ధనిక రాష్ట్రాలకు వచ్చి పనిచేస్తున్నవారే ఉదాహరణ అని అన్నారు.

ఎరుమేలిలో ఆందోళన చేస్తున్న అయ్యప్ప స్వాములను సముదాయిస్తున్న పోలీసులు

శబరిమలలో విపరీతమైన రద్దీ

దర్శించుకోకుండానే వెనుదిరుగుతున్న కొందరు భక్తులు

శబరిమల, డిసెంబర్ 24: కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. దీంతో రద్దీ విపరీతంగా పెరుగుతున్నది. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ నుంచి భక్తుల రాక విపరీతంగా ఉన్నది. రద్దీ దృష్ట్యా కొందరు భక్తులు, అయ్యప్ప మాలాధారులు స్వామివారిని దర్శించుకోకుండానే వెనుతిరుగుతున్నారు. ఎరుమేలిలో దాదాపు 4 కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో భక్తులు, స్వాములు కాలినడకనే శబరిమలకు వెళ్తున్నారు. ఓ వైపు రద్దీ, మరోవైపు భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. శబరిమల సన్నిధానానికి వెళ్లే అటవీ మార్గం సమయాన్ని ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పొడిగించారు.

ఈ పిల్లాడి మాట వింటే నా కంపెనీ దివాలా!

ఆనంద్ మహీంద్రా ఫన్నీ ట్వీట్

న్యూఢిల్లీ : ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ఆదివారం చేసిన ట్వీట్‌లో తన ఫ్రెండ్ చీకూ అనే బుడతడి మాటల వీడియోను షేర్ చేశారని చెప్పారు. అయితే చీకూ చెప్పినట్లుగా రూ.700కు కారును అమ్మితే, తన కంపెనీ దివాలా తీయడం ఖాయమని సరదాగా అన్నారు. చీకూ తన తండ్రితో మాట్లాడుతూ, ఎక్స్‌యూవీ700 మోడల్ కారును కొనాలని కోరాడు. పర్స్‌లో రూ.700 ఉన్నాయని, వాటితో ఈ కారును కొనేద్దామని చెప్పాడు. దీని అసలు ధర రూ.17 లక్షల నుంచి ప్రారంభమవుతుంది.

2500 ఏండ్లు చెక్కు చెదరదు!

- ఏ ప్రకృతి విపత్తూ ఏం చేయలేదు
- అష్టభుజి ఆకారంలో గర్భ గుడి
- దేశ సంస్కృతి ప్రతిబింబించే శైలి
- అయోధ్య రామాలయ ఆర్కిటెక్ట్ అశీశ్

అయోధ్య, డిసెంబర్ 24: దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రామ మందిర ప్రారంభోత్సవానికి అయోధ్య సిద్ధమవుతున్నది. వచ్చే ఏడాది జనవరి 22న ఆలయంలో రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరగనున్నది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమవుతున్న ఈ ఆలయానికి ఎన్నో విశిష్టతలు, ప్రత్యేకతలు ఉన్నాయి. ఏ విధమైన విపత్తు వచ్చినా ఆలయం చెక్కు చెదరదట. ఎంత పెద్ద ప్రకృతి విపత్తు వచ్చినా 2,500 ఏండ్లు తట్టుకొని నిలబడేలా ఆలయాన్ని డిజైన్ చేసినట్టు ఆర్కిటెక్ట్ అశీశ్ సోంపురా తాజాగా తెలిపారు. ఆలయాన్ని దేశ సంస్కృతిని ప్రతిబింబించేలా నాగర శైలిలో నిర్మిస్తున్నారు. ఇక ముఖ్యమైన ఆలయ గర్భ గుడిని అష్టభుజి ఆకారంలో తీర్చిదిద్దుతున్నామని, గర్భ గుడి అష్టభుజి ఆకారంలో ఉన్న దేవాలయాలు తక్కువని సోంపురా వివరించారు. ఆలయ శిఖరం కూడా అష్టభుజి ఆకారంలో ఉంటుందని తెలిపారు. భక్తులకు సదుపాయాలపై మాట్లాడుతూ ప్రధాన ఆలయ సముదాయం వరకు వెళ్లే కారిడార్‌లో 35-40 వేల మంది వెళ్లే అవకాశం ఉందని, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆలయ కాంప్లెక్స్ లోపల తక్కువ భవనాలు ఉంటాయని, మ్యూజియం, రిసెర్చ్ సెంటర్, ప్రార్థన మందిరం వంటి ఇతర సౌకర్యాలను బయట ఏర్పాటు చేయాలని అనుకొంటున్నామని చెప్పారు.

నేపాల్ నుంచి ప్రత్యేక కానుకలు

రామ మందిర ప్రారంభోత్సవానికి గుర్తుగా నేపాల్ పలు ప్రత్యేక కానుకలను పంపనున్నదని స్థానిక మీడియా పేర్కొన్నది. ఇందులో వివిధ రకాల నగలు, సామగ్రి, బట్టలు, మిఠాయిలు ఉంటాయని మై రిపబ్లికా వార్తాపత్రిక తెలిపింది. వీటిని అందజేయడం కోసం జనక్‌పూర్‌ధామ్-అయోధ్యధామ్ ప్రయాణం జనవరి 18న ప్రారంభమవుతుందని, 20 నాటికి అయోధ్య చేరుకుంటుందని జానకి ఆలయ మహంత రామ్‌రోషణ్ దాస్ వైష్ణవ్ తెలిపారు. అదే రోజున కానుకలను రామ మందిర ట్రస్టుకు అందజేస్తామని పేర్కొన్నారు. గతంలో అయోధ్య ఆలయంలో ప్రతిష్ఠించే రాముడి విగ్రహాన్ని తయారు చేసేందుకు నేపాల్ కాళిగండకి నదీ తీరంలో సేకరించిన శాలిగ్రామ రాళ్లను అయోధ్యకు పంపిందని పత్రిక తెలిపింది. కాగా, ఆలయం ప్రారంభోత్సవం నేపథ్యంలో బీజేపీ ఎంపీ సుభ్రతా పాఠక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రామ భక్తులపై కాల్పులు జరిపించిన సమాజ్‌వాదీ పార్టీ నేతలకు ఆహ్వానాలు పంపొద్దని రామ మందిర్ ట్రస్టుకు లేఖ రాశారు.

ఆదివారం అయోధ్యలో ముమ్మరంగా కొనసాగుతున్న రాముడి ఆలయ నిర్మాణ పనులు

వాతావరణ మార్పులతో దోమలు రెట్టింపు

వర్జీనియా, డిసెంబర్ 24: వాతావరణ మార్పుల వల్ల వాతావరణం వేడెక్కినపుడు దోమలు వృద్ధి చెందుతాయని వర్జీనియా కామన్‌వెల్త్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల అధ్యయనం వెల్లడించింది. దోమల లార్వాను తినే తూనీగలు వేడి వాతావరణంలో సమర్థతను చూపలేవని తెలిపింది. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నపుడు దోమల లార్వా వేగంగా వృద్ధి చెంది, దోమలుగా మారుతాయని తెలిపింది. అంటే సాధారణ ఉష్ణోగ్రత గల వాతావరణంలో కన్నా వేడి వాతావరణంలో రెట్టింపు దోమలు తయారవుతాయన్నమాట! తూనీగలు ఎదురుగా ఉన్నప్పటికీ, లార్వా నుంచి దోమలు పెరిగి, పెద్దవి అవుతూనే ఉంటాయని తెలిపింది.

ఆదివారం ఉదయం తాజ్‌మహల్ వద్ద దట్టంగా పేరుకుపోయిన పొగ మంచు

చలికి ఉత్తరాది గజగజ

న్యూఢిల్లీ, డిసెంబర్ 24: చలికి ఉత్తర భారతం గజగజ వణుకుతున్నది. జమ్ము, కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లలో భారీగా మంచు కురుస్తున్నది. దీంతో పంజాబ్, హర్యానా సహా ఉత్తర భారతంలో చలి తీవ్రత పెరిగింది. దేశంలోని పలు చోట్ల ఉష్ణోగ్రతలు కనిష్ఠం నమోదవుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు మైనస్ మూడు డిగ్రీలకు చేరాయి. చలికి ఇప్పటికే జమ్ము-కశ్మీర్‌లోని దాల్ సరస్సు సహా పలు నదులు గడ్డకట్టాయి. ఒడిశాలోని పలు ప్రాంతాల్లో పొగమంచు కురుస్తున్నది.



శరీరంలో అమర్చే వైర్‌లెస్ చార్జర్ అభివృద్ధి!

న్యూఢిల్లీ: మానవ శరీరంలోని బయో ఎలక్ట్రానిక్ పరికరాలను ఛార్జింగ్ చేయడానికి వైర్‌లెస్ చార్జింగ్ పరికరాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ పరికరాన్ని చర్మం కింది భాగంలో అమర్చవచ్చునని తెలిపారు. ఎలుకలకు దీనిని అమర్చి పరీక్షించినపుడు మంచి ఫలితాలు వచ్చాయన్నారు. మానవులపై నిర్వహించే ప్రయోగాల్లో కూడా విజయం సాధిస్తే, బ్యాటరీలు, వైరింగ్ లేని మెడికల్ ఇంప్లాంట్స్ అందుబాటులోకి వస్తాయన్నారు. శాస్త్రవేత్త వెయ్ లాన్ మాట్లాడుతూ.. బయోడిగ్రేడబుల్ ఇంప్లాంటబుల్ మెడికల్ డివైసెస్‌ను విస్తృత స్థాయికి తీసుకెళ్లడంలో తమ నమూనా పవర్ సప్లయ్ సిస్టమ్ గొప్ప ముందడుగును సూచిస్తుందన్నారు.

ఎర్ర సముద్రంలో రెచ్చిపోయిన హౌతీలు

అరేబియాకు విస్తరించిన దాడులు.. ఇరాన్ నుంచి నేరుగా ఓడలపై దాడి

న్యూయార్క్, డిసెంబర్ 24: ఎర్ర సముద్రంతో పాటు, అరేబియా సముద్రంపై యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్ రెచ్చిపోతుండటం ఆందోళన కలిగిస్తున్నది. అరేబియాలో భారత్‌కు వస్తున్న నౌకపై శనివారం ప్రయోగించిన డ్రోన్ ఇరాన్ నుంచి వచ్చిందని అమెరికా రక్షణ శాఖ పేర్కొన్నది. హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇరాన్ నేరుగా నౌకలను లక్ష్యంగా చేస్తున్నట్టు అమెరికా ఆరోపిస్తున్నది. తాజాగా శనివారం రెండు వాణిజ్య నౌకలపై హౌతీలు దాడులకు తెగబడ్డారు. అందులో భారత జాతీయ పతాకంతో వస్తున్న ముడి చమురు ట్యాంకర్ నౌక కూడా ఉన్నట్టు తొలుత అమెరికా పొరపడి ప్రకటన చేసింది. దీంతో పాటు మరో నౌకపై కూడా దక్షిణ ఎర్ర సముద్రంలో హౌతీలు దాడి చేసినట్టు యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది. ఎర్రసముద్రంలోని అంతర్జాతీయ జలాలపై హౌతీ రెబల్స్ యెమన్ భూభాగం నుంచి రెండు యాంటీ బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించారని తెలిపింది. అయితే ఓడలకు ఎలాంటి నష్టం కలగలేదని పేర్కొంది. ఎంవీ సాయిబాబా పేరుతో భారత్‌లో రిజిస్టరైన గబాన్‌కు చెందిన చమురు ట్యాంకర్ వస్తుండగా దాడి జరిగింది. అలాగే ఎంబీ బ్లామెనన్ పేరుతో కెమికల్, ఆయిల్ ట్యాంకర్ నార్వేజియన్ జెండాతో వస్తున్నది. మరోవైపు అరేబియాలో వాణిజ్య నౌకపై జరిగిన డ్రోన్ దాడి ఘటనపై భారత నేవీ దర్యాప్తు ప్రారంభించింది.

ప్రాణం తీసిన పతంగి మాంజా

ముంబై, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): పతంగి మాంజా ఒక కానిస్టేబుల్ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఒక కానిస్టేబుల్ పతంగి మాంజా వలన గొంతు తెగి చనిపోయాడు. ముంబై దిండోశి పోలీసు స్టేషన్‌కు చెందిన సురేష్ జాదవ్ అనే కానిస్టేబుల్ ఆదివారం డ్యూటీ ముగించుకుని మోటార్ సైకిల్‌పై వర్లిలోని తన ఇంటికి శాంతాక్రుజ్ దగ్గర వాకోలా బ్రిడ్జి మీదుగా వెళ్తుండగా పతంగి మాంజా వలన గొంతు కోసుకుపోయి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతడిని సియాన్ హాస్పిటల్ కు తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ప్రకటించారు.